www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 15 అక్టోబర్ 2024
5
చిత్తూరు

మద్యం టెండర్లు లాటరీ ద్వారా కేటాయిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

పొంచి ఉన్న 'తుపాన్' ముప్పు

- మూడు రోజుల పాటు భారీ వర్షాలు
- అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం
- కంట్రోల్ రూమ్, రెస్క్యూ బృందాలు ఏర్పాటు
- 15,16 తేదీల్లో స్కూల్స్, కాలేజీలు సెలవు
- పునరావాస కేంద్రాలు సిద్ధం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ముందస్తు ఏర్పాట్లు పక్కాగా చేపడుతున్నారు. నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఇప్పటికే నగరంలో లోతట్టు ప్రాంతాలు, పెద్ద కాలువల్లో ఉన్న ప్రాంతాల్లో పర్యటించి చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూమ్‌లో ముగ్గురు అధికారులు, మరో ముగ్గురు సహాయకులను నియమించి, 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. వర్షాల కారణంగా ఏమైనా అత్యవసర పరిస్థితులు ఉంటే కంట్రోల్ రూమ్ నెంబర్ 98499 07885 సమాచారం ఇవ్వాలన్నారు. వర్షాలు సమయంలో తీసుకోవలసిన ముందస్తు చర్యలు, అత్యవసర సమయాల్లో వేగంగా స్పందించడానికి వీలుగా సహాయక ఇంజనీర్, ఆరోగ్యాధికారి, ఎసీపీ ఆధ్వర్యంలో మూడు రెస్క్యూ బృందాలను ఏర్పాటు చేశారు. వర్షాల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రజారోగ్య విభాగం, ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగాలకు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. అత్యవసర సమయాల్లో తగిన సహాయ సహకారాలు అందించాలని రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ అగ్నిమాపక శాఖ అధికారులను కోరారు. ప్రతి కార్యాలయంలోనూ మేనేజర్, ఆర్ఓ, ఏఈలు, సానిటరీ ఇన్స్పెక్టర్, ఆర్ఐలతో కూడిన హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. వార్డు స్థాయిలో వార్డు కార్యదర్శులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

ఎక్కడా నీరు నిల్వ చేరకుండా చర్యలు : కమిషనర్

వర్షాల నేపథ్యంలో నగరంలో ఎక్కడా వర్షపు నీరు నిల్వచేరకుండా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కమిషనర్ నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మిట్టూరులోని గంగినేని చెరువు మొరవ కాలువను పరిశీలించారు. కాలువలో అడ్డంకులు తొలగించాలని, ఆక్రమణలు తొలగించేలా సంబంధిత వ్యక్తులకు సత్వరం నోటీసు జారీ చేయాలని ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. అధిక వర్షాల హెచ్చరికల నేపథ్యంలో కాలువలో ఎక్కడా నీరు నిల్వచేరకుండా సాఫీగా వెళ్లేలా చూడాలన్నారు. అనంతరం కమిషనర్ సీఎంటి రోడ్డులో మేజర్ కాలువను పరిశీలించారు. ఎన్టీఆర్ బస్టాండ్ వద్ద నిలిచిన నీటిని పరిశీలించారు. సత్వరం మట్టిని తొలగించాలని ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. నీవానదిలో ఎక్కడా అడ్డంకులు లేకుండా పూడిక, వ్యర్థాలు తొలగించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వర్షాలు మరో మూడు రోజులు పాటు కొనసాగుతుందనే హెచ్చరికలు నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, చిన్న, పెద్ద కాలువల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, సానిటరీ ఇన్స్పెక్టర్ లోకనాథం, ఎంపీలు లోకేష్, రవీంద్ర, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

మురుగునీటి కాలువలను పరిశీలిస్తున్న నగర కమిషనర్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అధికారులు వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలి

చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు సూచించారు. రాయలసీమలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఎంపి ఢిల్లీ నుంచి సోమవారం స్పందించారు. అల్పపీడనం నేపథ్యంలో బుధ, గురువారాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలను రక్షించడానికి జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని సూచించారు. నెల్లూరు, వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. చిత్తూరు ఉమ్మడి జిల్లాలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం ఎక్కడా రాజీపడకుండా తమ కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తించాలని ఆయన సూచించారు.

కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు పిలుపు

ఈనెల 14 నుండి 17వరకు రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున జిల్లాలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అలాగే సిపిఎం కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తుపాన్ నేపథ్యంలో జిల్లా అధికారుల నుండి మండలస్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. అలాగే లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రాణ, పశు,ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, మండల స్థాయిలో అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని లోతట్టు ప్రాంతాల ప్రజలను, శిథిలావస్థలో ఉన్న భవనాలలో ఉన్న వారిని, పూరిగుడిసెల్లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. గతంలో చెరువులు, వాగులు, వంకలు వద్ద ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ముందస్తుగా తీసుకున్న చర్యలు లాగా ఈసారి కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ ముందుగానే జిల్లా అధికారులను అప్రమత్తం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

నేడు, రేపు పాఠశాలలకు సెలవు

బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వాతావరణ శాఖ, విపత్తు నిర్వహణ శాఖ హెచ్చరికల మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా చిత్తూరు జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు, నేడు, రేపు అనగా అక్టోబర్ 15, 16 తేదీలు సెలవు దినముగా ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. అన్ని యజమాన్య పాఠశాలలు పై ఆదేశాలు విధిగా పాటించవలసినదిగా కోరడమైనది. తుపాను కారణంగా పాఠశాలలకు ఏదైనా నష్టం జరిగిన ఎడల సదరు పాఠశాల వివరాలు డీఈవో, ఎంఈవోలు, ఏపిసి ఎసెస్ కార్యాలయానికి తక్షణం పంపాలని జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజులు కోరారు.

తుపాన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

కంట్రోల్ రూమ్ నెంబర్:9491077356, ల్యాండ్ లైన్: 08572-242777

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల కురిసే భారీ వర్షాల నేపథ్యంలో చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడమైనదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ తుపాను కంట్రోల్ రూమ్ నెంబర్:9491077356. ల్యాండ్ లైన్: 08572-242777 చిత్తూరు ఆర్‌డిఓ కార్యాలయం- కంట్రోల్ రూమ్ నెం: 9491077011, కుప్పం ఆర్‌డిఓ కార్యాలయం- కంట్రోల్ రూమ్ నెం: 9966072234, పలమనేరు ఆర్‌డిఓ కార్యాలయం- కంట్రోల్ రూమ్‌నెం: 9491074510, నగరి ఆర్‌డిఓ కార్యాలయం- కంట్రోల్ రూమ్ నెం: 9701019083.

పిహెచ్‌సి, సిహెచ్‌సిలలో డాక్టర్లు అందుబాటులో ఉండాలి: కలెక్టర్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

బంగాళాఖాతంలో అల్పపీడనం నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా అధికారులను, ఆర్‌డిఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలను ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా అధికారులతో రానున్న మూడు రోజుల్లో వాతావరణ శాఖ వారి హెచ్చరికలతో జిల్లాలో భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలో జిల్లా అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ జిల్లాలో ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మండలాల వారీగా చెరువుల కట్టలు, కాలువ కట్టల పరిరక్షణపై దృష్టి పెట్టాలని, వాగులు, వంకలు, కాలువల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కేంద్రంలో ఈనెల 15న నిర్వహించాల్సిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే జిల్లా లోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు అంగన్వాడీ కేంద్రాలకు ఈనెల 15,16వ తేదీలలో సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, షిఫ్టుల వారీగా 24/7 సిబ్బంది పని చేయడం జరుగుతుందని జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన పంటల సాగు చేసే రైతులను అప్రమత్తం చేయాలని పంట నష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి రైతులను అప్రమత్తం చేయాలని వ్యవసాయ ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయం అయితే వెంటనే దానిని పునరుద్ధరించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల వెంట వర్షాలతో చెట్లు విరిగిపడడం తదితర కారణాలతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయని ఇటువంటి సమస్యలు రాకుండా దీన్ని నివారించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని అన్ని ఏరియా ఆసుపత్రులు, పిహెచ్‌సిలలో సకాలంలో డాక్టర్లు వైద్యసేవలు అందించేందుకు అందుబాటులో ఉండాలని అవసరమైన మందులను అందుబాటులో ఉండేలా చూడాలని డిఎంఅండ్‌హెచ్‌ఓను కలెక్టర్ ఆదేశించారు. పూరి గుడిసెలు, శిథిలావస్థలో ఉన్న ఇండ్లను గుర్తించి వారిని పునరావాస కేంద్రాలకు తరలించేలా సమీపంలోని పాఠశాలలు, కళాశాలలను పునరావాస కేంద్రాలుగా గుర్తించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి నుండి మండల స్థాయి వరకు అందరు అధికారులు సమిష్టిగా పనిచేసే విపత్తును ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎస్ఈపిఆర్ శంకర్ నారాయణ, జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్ కుమార్, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ప్రభావతి దేవి, డీఈఓ దేవరాజులు, హౌసింగ్, డ్వామా పీడీలు పద్మనాభం, రవికుమార్, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల అధికారులు మురళీకృష్ణ, డాక్టర్ ప్రభాకర్, డిపిఓ లక్ష్మి అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మద్యం షాపులు కేటాయింపు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో ప్రభుత్వ నూతన మద్యం విధానంలో భాగంగా మద్యం దుకాణాలను పారదర్శకంగా ప్రశాంతంగా లాటరీ పద్ధతిలో కేటాయింపు ప్రకియ పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సోమవారం చిత్తూరు జిల్లా కేంద్రంలో ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ లాటరీ పద్ధతిలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం 8 గంటల ప్రారంభమైన లాటరీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యంలో ప్రశాంతంగా నిర్వహించిన దుకాణాల కేటాయింపు ప్రక్రియ మధ్యాహ్నం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంతంగా, పారదర్శంగా మద్యం దుకాణాల కేటాయింపు లాటరీ ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు. ఈ ప్రక్రియను పూర్తిగా వీడియోగ్రాఫర్లతో వీడియో చిత్రీకరించినట్లు తెలిపారు. ఆయా షాపులకు టెండర్లు దాఖలు చేసిన దరఖాస్తుదారుల సమక్షంలోనే లక్కీడిప్ తీసి షాపు దక్కించుకున్న వారి పేరును ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 104 మద్యం దుకాణాలకు 2,266 మంది టెండర్లు దాఖలు చేయగా, 104 మద్యం షాపులకు లక్కీడిప్ ద్వారా 104 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈలక్కీడిప్ కార్యక్రమంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ విజయ్ శేఖర్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ శ్రీనివాస్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ప్రభావతి దేవి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వర్షాల నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ప్రభావతి దేవి వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాలోని వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే నాలుగు రోజులు బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాన్ కారణంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సిబ్బంది ఎవరికీ సెలవులు ఇవ్వకూడదని సూచించారు. అలాగే అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్త తీసుకోవాలని, సీజనల్ వ్యాధులైన డయేరియా, మలేరియా, డెంగీ జ్వరాలపై వైద్యాధికారులు రోజువారి మానిటరింగ్ చేయాలన్నారు. స్కూల్స్, హాస్టల్స్‌లో వైద్యాధికారులు, సిహెచ్‌ఓలు రోజువారి కార్యచరణతో వాటర్ టెస్టింగ్, మెడికల్ క్యాంపులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రోగ్రాం అధికారులు డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ శిరీష, డాక్టర్ అనిల్, జార్జ్, రామ్మోహన్ పాల్గొన్నారు.

వీడియో క్వారెన్స్‌లో మాట్లాడుతున్న డాక్టర్ ప్రభావతి దేవి

'ముక్కంటి' భక్తులు 'హర్ట్'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: 'ముక్కంటి' భక్తులు శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకోవాలంటే 'ఆధార్' ను తప్పనిసరి చేస్తూ ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర ఆజాద్ తీసుకున్న వివాదాస్పద నిర్ణయంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. శివ శివా ఇదేం పద్ధతి.. ఇదేం సంప్రదాయం.. అంటూ మండిపడుతున్నారు. ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఎవరు అధికారులుగా వచ్చినా అసంబద్ధ, వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడం, వాటిని అమలు చేయడం పరిపాటిగా మారిపోయిందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆలయంలో అన్నీ మంచి కార్యక్రమాలు జరుగుతాయని అందరూ భావించారు. అయితే అందుకు విరుద్ధంగా సంప్రదాయం పేరుతో వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడం, సంస్కరణల పేరుతో నిబంధనలు అమలు చేయడంలో అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలను మూటగట్టుకుంటున్నారు. ప్రస్తుత ఈవో వచ్చీరాగానే సిబ్బంది సంప్రదాయ దుస్తులు ధరించాలని నిబంధన పెట్టారు. రాహు-కేతు పూజలకు వెళ్లే భక్తులకూ వాటిని అమలు చేశారు. సిబ్బంది సాంప్రదాయ దుస్తులు ధరించడం ఎప్పటినుంచో ఉంది. అదేవిధంగా భక్తులు కూడా సంప్రదాయ దుస్తులు ధరించి రావాలనే నిబంధన పెట్టడం కూడా సబబే. అయితే అమలుకు కొంత సమయం ఇవ్వాలి. అనుకున్నదే తడవుగా అమలు చేయడం ఎంతవరకు సమంజసమో అధికారులు ఆలోచించాలి. ప్రతి ఏటా రాహు కేతు పూజల వల్ల 70 శాతానికి పైగా ఆదాయం ఆలయానికి వస్తోంది. ఈ పూజలకు సంప్రదాయ దుస్తులు ధరించిన వారిని మాత్రమే అనుమతిస్తే ఆదాయం గణనీయంగా పడిపోయే ప్రమాదం ఉంది. అంతేగాకుండా చెడు ప్రచారం జరిగే ప్రమాదం లేకపోలేదు. ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, విదేశాల నుంచి కూడా భక్తులు వచ్చి రాహు కేతు పూజలు చేయించుకుంటూ ఉంటారు. వారికి ముందుగా సమాచారం తెలియజేయాలి. అందుకు కొంత సమయాన్ని ఇవ్వాలి. 'ఉరుము ఉరిమినట్లు మెరుపు మెరిసినట్లు' ఆలోచన రావడం, అమలు చేయడం అసలుకే మోసం అనే విషయాన్ని అటు అధికారులు, ఇటు ప్రభుత్వం గుర్తించాలి. ఇక స్థానిక భక్తులకు ఆధార్ నిబంధన పెట్టడం కూడా సబబు కాదన్న విమర్శలు వస్తున్నాయి. స్థానిక భక్తులు ప్రతి రోజూ స్వామి అమ్మవార్లను దర్శించుకుని దిన చర్య ప్రారంభించే వారు చాలామంది ఉన్నారు. అదేవిధంగా సాయంత్రం వేళ మహిళలు భారీ సంఖ్యలో స్వామి అమ్మవార్ల దర్శనానికి వస్తుంటారు. స్థానికంగా ఉన్న ఆచారాలను కూడా అధికారులు గౌరవించాల్సి ఉంటుంది. నాలుగు గోపురాల నుంచి భక్తులు ఆలయంలోకి వెళుతుంటారు. గోపురాలు వద్ద ఉన్న సిబ్బంది స్థానికులను గుర్తించడం చాలా సులువు. అందరూ పిఆర్ఓ కార్యాలయానికి వెళ్లి ఆధార్ కార్డులు చూపించడం అనేది కష్టమైన పని. పి ఆర్ ఓ కార్యాలయంలో 20 మంది సిబ్బందిని నియమించినా ఆధార్ కార్డులు పరిశీలించి పంపడం అనేది కష్టమవుతుంది. ఆచరణలో అమలు కావడం సాధ్యం కాదు. ఎవరైనా, ఏ అధికారైనా సాఫీగా జరిగిపోవాలని చూడాలి తప్ప, అతిగా వివాదాస్పదంగా ఉండాలని భావించకూడదు. నిర్ణయం తీసుకునే ముందు సాధ్యా సాధ్యాలను పరిశీలించాలి. స్థానిక ఎమ్మెల్యే భక్తుల మనోభావాలననుసరించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. లేకుంటే ఇబ్బందులు తప్పవని స్థానిక భక్తులు హెచ్చరిస్తున్నారు.

గ్యాస్ కోసం పడిగాపులు

గ్యాస్ సిలిండర్ కోసం వర్షంలోనూ క్యూలో ఉన్న స్థానికులు

ప్రజాశక్తి- విజయపురం (నగరి) మహిళల కళ్లలో కన్నీరు రాకుండా చూసుకుంటామన్న కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే మహిళలకు గ్యాస్ కోసం వర్షంలోనూ క్యూలో నిలపెట్టి ఇబ్బందులకు గురిచేస్తోంది. సోమవారం నగరి దేశమ్మ గుడి వద్ద మహిళలు గ్యాస్ కోసం వర్షంలో క్యూకట్టారు. ఒక గ్యాస్ సిలిండర్ తీసుకోవడం కోసం సుమారు రెండు గంటల సేపు క్యూలో నిలబడవల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది గంటల తరబడి క్యూలో నిలబడలేక సిలిండర్ తీసుకోకుండానే తిరిగి వెళ్లిపోయారు. గ్యాస్ సిలిండర్ల పంపిణీలో నిర్లక్ష్యం జరుగుతోందని అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని స్థానిక మహిళలు కోరుతున్నారు.

ఎస్‌విఎంసి ఎంబీబీఎస్ క్లాసులు ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఎస్‌వి వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం యంబిబిఎస్ నూతన వైద్య విద్యార్థినీ విద్యార్థినులకు ఒరియంటేషన్ క్లాసులను ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ ప్రారంభించారు. ఎస్వీఎంసీ ఆడిటోరియంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైద్యో నారాయణ హరి అన్నట్టుగా, తల్లి తండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా పట్టుదలతో వైద్య విద్యను అభ్యసించాలి అని విద్యార్థులకు సూచించారు.వైద్య కళాశాలలో బోధనా పద్ధతులపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు రుయా సూపరిటెండెంట్ డాక్టర్ జి రవి ప్రభు తెలిపారు. ఎస్ వి వైద్య కళాశాలలో ర్యాగింగ్ ఫ్రీ జోన్‌గా పేర్కొన్నారు. ప్రసూతి ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ బి.పార్థసారథి రెడ్డి, ఎస్ వి వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ వెంకటేశ్వర్లు (పరిపాలన) , సునీత సిరిగిరి, (అకాడమిక్), బి ఎస్ ఎన్ మూర్తి, (పరిశోధనలు),పాహిం, సుజాత పాల్గొన్నారు.

'పల్లె పండుగ'తో అభివృద్ధికి బాటలు

అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గురజాల

భూమి పూజలో ఎమ్మెల్యే గురజాల

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా.. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 'పల్లె పండుగ' కార్యక్రమంతో గ్రామాల్లో అభివృద్ధికి బాటలు పరుచుకున్నాయని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. సోమవారం చిత్తూరు రూరల్ మండలం అనంతాపురం, ఆనగల్లు, పాలూరు, ముత్తుకూరు, తాళంబేడు క్రాస్ గ్రామాల్లో పల్లెపండుగ- పంచాయతీ వారోత్సవాలలో భాగంగా నిర్వహించి నిర్దేశించిన అభివృద్ధి ఉపాధి పనులకు భూమి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గడచిన కొన్నేళ్లుగా గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, పల్లె ప్రజలకు మౌలిక వసతులు కరువయ్యాయని అన్నారు. పల్లెలను తిరిగి అభివృద్ధి బాట పట్టించేందుకు, పల్లెప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగానే పల్లె పండుగ పేరుతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేశామని, ప్రతి ఆరునెలలకు ఒకసారి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఐదు గ్రామాల పరిధిలో రూ.60లక్షలు విలువైన 9 సిమెంట్ రోడ్ల పనులకు భూమిపూజ నిర్వహించారు. ఎన్నికల హామీల మేరకు ఉచిత గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్ దీపావళి నుంచి అమలు చేస్తామని చెప్పారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు చంద్ర ప్రకాష్, రూరల్ మండలం మాజీ ఎంపిపి జయచంద్ర నాయుడు, మోహన్ రాజ్, జగదీశ్వర్ నాయుడు, శశికర్ బాబు, ముత్తుకూరు మోహన్, మేషాక్, రఘు, కుమార్ పాల్గొన్నారు.

గోకులం షెడ్లు నిర్మాణానికి భూమి పూజ

రామకుప్పం: మండల పరిధిలోని బందార్లపల్లి పంచాయతీ, బగళనత్తం గ్రామంలో గోకులం షెడ్లు నిర్మాణానికి టిడిపి నేతలు భూమిపూజ చేశారు. ఈసందర్భంగా కూటమి ప్రభుత్వంలో పేదప్రజలకు ఉపాధి హామీ పథకంలో సబ్సిడీ ద్వారా షెడ్లు నిర్మించి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఆవులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకంతో అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, రాఘవేంద్ర నాయుడు, హనుమంతు, ఉపాధి హామీ సిబ్బంది మునిరత్నం, పాల్గొన్నారు.

రామకుప్పంలో గోకులం షెడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న టిడిపి నేతలు

కందూరు, తమ్మి నాయునిపల్లి పంచాయతీల్లో..

సోమల: సోమల మండలంలోని మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు, తమ్మి నాయునిపల్లి పంచాయతీ పరిధిలోని మిట్టపల్లి, పేగలవారిపల్లి గ్రామాలలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సిమెంటు రోడ్డు పనుల నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు ఉపాధి హామీ ఏపీవో దినకర్ బాబు తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీలలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ వారిచే చేపట్టనున్న సిమెంటు రోడ్లు పనులకు భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయశంకర్, వీఆర్వో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్లకు భూమి పూజ

ఎస్ఆర్ పురం: మండలంలో పల్లె పండగలో ఉడమలకుర్తి, విలాసావరహపురం పంచాయతీలలో మంజూరైన సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలకు సోమవారం ఎంపీడీవో మోహన్ మురళి స్థానిక సర్పంచులు ప్రజాప్రతినిధులు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలను ఉపాధి హామీ పథకం నిధులు, పంచాయతీ నిధులతో మంజూరు చేసిందని నాణ్యమైన రోడ్ల నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. వి పురం టిడిపి నాయకుడు సిద్దయ్య శెట్టి, చిట్టి మహేష్, వేణు శెట్టి, ఏపీవో చంద్రశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్ రేఖ, నౌషాద్, అసిస్టెంట్ ఇంజనీర్ కుమార్ పాల్గొన్నారు.

వి పురంలో సిసి రోడ్డుకు భూమిపూజ చేస్తున్న అధికారులు, నాయకులు

ఇన్‌ఛార్జ్ ఎంపీడీవోగా హరిప్రసాద్ రెడ్డి

ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో హరి ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండల ఇన్‌ఛార్జ్ ఎంపీడీవోగా హరిప్రసాద్ రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గత కొంతకాలంగా ఇన్‌ఛార్జ్ ఎంపీడీవోగా పనిచేసిన రాఘవేంద్ర రాజు బదిలీపై వెళ్లారు. కాగా ఇన్‌ఛార్జ్ ఎంపీడీవోగా హరి ప్రసాద్‌రెడ్డిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

మాజీ సీఎంను కలిసిన అబ్దుల్ కలాం ట్రస్ట్ సభ్యులు

ప్రజాశక్తి-పుంగనూరు: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డికి తెలిపారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం హెల్త్, ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ పి అయూబ్ ఖాన్ సోమవారం కలికిరి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా మాజీ సీఎంను కలిశారు. పుంగనూరులో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహం ఏర్పాటు చేస్తామని చెప్పారు. కలాం పేరుతో ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా పలు సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మాజీ సీఎం దీనిపై స్పందిస్తూ అబ్దుల్ కలాం ట్రస్ట్‌కు తన వంతు చేయూత ఇస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నరసింహులు, అమర, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్‌లకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-రామకుప్పం: అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ నూతన పింఛన్‌లకు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో లక్ష్మీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగులు వారి పరిధిలోని సచివాలయంలో ఆధార్ కార్డు, రేషన్ కార్డులు తమ వెంట తీసుకొని నమోదు చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ ఈనెల 15వ తేదీ మంగళవారం నుంచి ప్రారంభమవుతుందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని పంద్యాలమడుగు పంచాయతీ, గొల్లపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త ముని వెంకటమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న టిడిపి నేతలు ఆమె భౌతికయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి పార్టీ తరఫున పదివేల రూపాయలను వారి కుటుంబ సభ్యులకు అందించారు. కూటమి ప్రభుత్వంలో బడుగు బలహీనవర్గాల పేదలను ఎల్లప్పుడూ ఆదుకుంటామని భరోసా కల్పించారు. మాజీ సర్పంచ్ గంట్లప్ప గౌడు, తెలుగు యువత అధ్యక్షుడు విశ్వనాథ్, నేతలు మురుగేష్, కుట్టి, పార్థసారథి, వేణు, గిరి, జయరామప్ప, గండ్లప్ప పాల్గొన్నారు.

ఉచిత డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయపురం(నగరి): రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ఉత్తర్వుల మేరకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ద్వారా ఎస్‌జిటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల నిమిత్తం ఉచిత బోధన, ఉచిత భోజన, వసతి సౌకర్యములతో మూడు నెలల పాటు శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా సంక్షేమ, సాధికారి అధికారి డాక్టర్ జి.రాజ్యలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ శిక్షణ పొందుటకు టెట్ అర్హత కలిగి, వార్షికాదాయం రూ.2.5 లక్షలు లోపు ఉన్నవారు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈనెల 11 నుంచి 21వ తేదీ లోపు జ్ఞానభూమి వెబ్ సైట్‌లో ధరఖాస్తు చేసుకోవచ్చును. ధరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ ఈనెల 27వ తేదీన స్క్రీనింగ్ టెస్ట్ పరీక్ష నిర్వహించి అర్హులైన అభ్యర్థులను మెరిట్ లిస్ట్ ప్రకారం ఉచిత డీఎస్సీ శిక్షణకు ఎంపికచేస్తారని తెలిపారు. వివరాల కొరకు జ్ఞానభూమి వెబ్ సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విధుల్లో కనిపించని టైపిస్ట్

ప్రజాశక్తి-విజయపురం: మండల ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం టైపిస్ట్ విధుల్లో కనిపించలేదు. సోమవారం పల్లె పండుగ కార్యక్రమానికి ఎంపీడీవో, ఈవోఆర్‌డీ, ఉన్నత అధికారులు వెళ్లారు. అయితే కార్యాలయంలో టైపిస్ట్ కనిపించలేదు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అక్కడి నుంచి వెనుతిరిగారు.

అప్రమత్తతతో సీజనల్ వ్యాధులు దూరం

- వైద్యుల సూచనలు తప్పనిసరి
- పరిసరాల పరిశుభ్రత పాటించాలి
- దోమ కాటుకు దూరంగా ఉండాలి
- వాతావరణ మార్పులతో మరింత అప్రమత్తత అవసరం
- పచ్చికాపల్లం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సురేఖ

ప్రజాశక్తి-వెదురుకుప్పం:

పరిసరాల పరిశుభ్రత పాటించడం, వ్యక్తిగత పరిశుభ్రతను అలవర్చుకోవడం, మంచి పోషకాహారం తీసుకోవడం, దోమకాటుకు దూరంగా ఉండడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించడం వల్ల సీజనల్ వ్యాధులు దూరమవుతాయి. తద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందొచ్చునని పచ్చికాపల్లం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సురేఖ అన్నారు. వాతావరణ మార్పులతో వచ్చే ఆరోగ్య సమస్యలు, సీజనల్ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సూచనలు పాటించి తగు జాగ్రత్తలు వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె అన్నారు. గ్రామాల్లో ప్రబలుతున్న వ్యాధుల పట్ల ఆమె ప్రజాశక్తితో ముఖాముఖి మాట్లాడారు.

ప్రజాశక్తి: సీజనల్ వ్యాధులకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు.?

డాక్టర్: పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత, పోషకాహారం తీసుకోవడం వల్ల దాదాపు వ్యాధులన్నింటికీ దూరంగా ఉండొచ్చు. తప్పనిసరిగా వైద్యుల సూచనలు పాటించి ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రజాశక్తి: గ్రామాల్లో ప్రబలుతున్న విషజ్వరాలపై తక్షణం తీసుకోవాల్సిన చర్యలు.?

డాక్టర్: గ్రామాల్లో విపరీతంగా విషజ్వరాలు అలుముకుంటున్నాయి. వాతావరణ మార్పులు వల్ల కొన్ని, దోమకాటు, అపరిశుభ్రమైన నీరు, ఆహారం తీసుకోకపోవడం వల్ల కొన్ని వ్యాధులు వస్తున్నాయి. నిర్లక్ష్యం చేయకుండా సమీప వైద్యులను సంప్రదించాలి. తగు వైద్య సేవలు పొందాలి.

ప్రజాశక్తి: డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వాటిని ఎలా గుర్తించొచ్చు..?

డాక్టర్: కండరాల నొప్పి, విపరీతమైన జ్వరం, తలనొప్పి, నిరసత్వం, కొన్ని సందర్భాల్లో వాంతులు, వీరేచనాలు, నిస్సత్తువ వంటివి లక్షణాలు ఉంటాయి. ప్రాథమిక దశలోనే రక్త పరీక్షలు చేయించుకోవాలి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటివి నిర్ధారణ అయితే తగిన వైద్యం తీసుకోవాల్సి ఉంటుంది. జ్వరం వచ్చిన వెంటనే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

ప్రజాశక్తి: వాధ్యుల నివారణకు గ్రామాల్లో మీరు తీసుకుంటున్న చర్యలు.?

డాక్టర్: వైద్య సిబ్బంది, 104వాహనంతో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. వివిధ వ్యాధులకు సంబంధించి గ్రామీణ స్థాయిలోనే వైద్యం అందిస్తున్నాం. ఆసుపత్రి వద్ద మరింతమందికి వైద్య సేవలందిస్తున్నాం. గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

ప్రజాశక్తి: తుపాన్ ప్రభావం దృష్ట్యా ప్రజలకు మీరిచ్చే సూచన.?

డాక్టర్: తుపాన్ ప్రభావం వల్ల పరిసరాల్లో శుభ్రంగా ఉంచుకోవాలి. దోమల నివారణకు పూర్తి చర్యలు చేపట్టాలి. కాచివడపోసిన శుభ్రమైన నీటినే తాగాలి. ఎక్కువగా వర్షంలో తడవకుండా ఉంటే మంచిది.

సచివాలయానికి దారి మూసివేత

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు రూరల్ మండలం జగమర్ల గ్రామంలో సచివాలయం, ఆర్‌బికె భవనాలు నిర్మించారు. ఆ కార్యాలయాలకు వెళ్లే దారి సమస్య ఉండడంతో స్థానికులు కొందరు దారిని మూసివేశారు. సోమవారం ఆ గ్రామంలోని ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, ఘర్షణ వాతావరణం నెలకొంది. దారిని అడ్డుకున్నారని సమాచారం అందుకున్న ఎంపీడీవో ఖాదర్ బాషా అక్కడకు చేరుకొని విచారణ చేపట్టారు. ఇరువర్గాల వాదన విన్న

దారి సమస్యపై విచారిస్తున్న ఎంపీడీవో

ఆయన సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకొనేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

'భవనాన్ని కేటాయించండి'

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: మాజీ సైనికుల సంక్షేమ కార్యాలయానికి పాత కలెక్టరేట్లో భవనాన్ని కేటాయించాలని మాజీ సైనికుల సంక్షేమ అధికారి కె.వి రాఘవులు కలెక్టర్ సుమిత్ కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. మాజీ సైనికుల సంక్షేమ అధికారిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సోమవారం కలెక్టర్‌ను కలిసి భవన కేటాయింపు, మాజీ సైనికుల సంక్షేమం కోసం నిర్వహించాల్సిన కార్యక్రమాలపై కలెక్టర్‌తో చర్చించారు.

తాటి బెల్లం కాఫీ ఆరోగ్యానికి మంచిది: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: తాటి బెల్లం కాఫీ ఆరోగ్యానికి ఎంతో మంచిదని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. స్థానిక కొంగారెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన శ్రీ గణపతి కేఫ్ తాటి బెల్లం కాఫీ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మారిన ఆహారపు అలవాట్లతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో సాంప్రదాయ వంటల ప్రాధాన్యత పెరిగిందన్నారు. ఇందులో భాగంగా సాంప్రదాయ పద్ధతిలో హోటళ్లు ఏర్పడడం

కాఫీ కేఫ్‌ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్

స్వాగతించాల్సిన విషయం అన్నారు. కార్యక్రమంలో గణపతి కేఫ్ అధినేత శ్రీధర్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ

ప్రజాశక్తి-సోమల:

సోమల పోలీస్‌స్టేషన్‌ను చౌడేపల్లి రూరల్ సీఐ రాంభూపాల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలను ఇస్తూ వాతావరణ శాఖ ప్రకటించిన విధంగా రానున్న రెండు రోజులు అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలకు పోలీసు శాఖ అందుబాటులో ఉండి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఐ శివశంకర్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

'వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం హర్షణీయం'

ప్రజాశక్తి-కుప్పం టౌన్: వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడం పట్ల కుప్పం నియోజకవర్గ వాల్మీకి కులస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు సోమవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం హాజరయ్యారు. పలువురు నాయకులు మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో భాగంగా మంత్రి నారా లోకేష్ వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఆయన ఇచ్చిన హామీ ప్రకారం అధికారం చేపట్టిన మొదటి సంవత్సరంలోనే రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వాల్మీకుల అభివృద్ధి టీడీపీతోనే ప్రారంభం అయిందని, ముఖ్యంగా కుప్పం నియోజకవర్గంలో వాల్మీకుల సౌకర్యార్థం క్రిష్ణగిరి పలమనేరు జాతీయ రహదారికి ఆనుకుని కోట్ల రూపాయలు విలువచేసే స్థలాన్ని వాల్మీకి కమ్యూనిటీ భవన నిర్మాణానికి కేటాయించడంతో పాటు సుమారు రెండు కోట్ల రూపాయల నిధులను భవన నిర్మాణానికి మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో స్థానిక వాల్మీకి కులస్తులు ప్రేమ్ కుమార్, జిమ్ దాము, సురేష్, బెటప్ప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్యుల పర్యవేక్షణలో ఉండాలి

- వైద్యాధికారి సోనియా

ప్రజాశక్తి-సోమల: రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో గర్భిణులు వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని వైద్యాధికారి సోనియా సూచించారు. సోమవారం ఆవులపల్లె సబ్ సెంటర్‌లో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పెద్ద ఉప్పరపల్లె ప్రభుత్వ ఆరోగ్య కేంద్ర పరిధిలోని డెలివరీ తేదీ దగ్గరగా ఉన్న గర్భిణులు వైద్యశాలలో చేరి వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని తెలిపారు.

దాతృత్వం చాటుకున్న కన్నన్

ప్రజాశక్తి-కుప్పం టౌన్:

కుప్పం మండలం గరిగచినేపల్లి గ్రామానికి చెందిన సంతోష్ గత కొద్ది రోజులకు ముందు మరణించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా అతనికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మీరందరూ 10 సంవత్సరాలలోపు వయస్సు గల చిన్నారులు కావడం గమనార్హం. పైగా బాధిత కుటుంబ సభ్యులు దళిత సామాజిక వర్గానికి చెందిన నిరుపేద కుటుంబీకులు.

సమాచారం తెలుసుకున్న దళిత నాయకులు, కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్ బాధిత కుటుంబ సభ్యులకు తన వంతు సాయంగా రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు ఆర్ముగం, యూనిట్ ఇన్‌ఛార్జ్ చంద్ర, గ్రామ టిడిపి అధ్యక్షులు శ్రీనివాసులు, గరిగచినేపల్లి ఎస్సీ కాలనీ ప్రజలు, యువత పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న కన్నన్

మృతుని కుటుంబానికి..

కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు మోడల్ కాలనీకి చెందిన కన్నప్ప అనారోగ్యంతో అకాల మరణం చెందారు. సోమవారం కన్నప్ప కుటుంబ సభ్యులకు మోడల్ కాలనీలోని స్థానికులు వారికి తోచిన విధంగా ఆర్థిక సాయం చేశారు. కాలనీ ప్రజలు చేసిన ఆర్థిక సాయం మొత్తం రూ.5వేల రూపాయలు మృతుని కుటుంబానికి స్థానికులు ప్రజల ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో గని, వెంకటేష్, అంజేత్, బుజ్జి, ముబారక్, చాన్, అస్లం, నవాజ్, మంజు, శివ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తజనం

ప్రజాశక్తి-రామకుప్పం: రామకుప్పంలో నెలకొని ఉన్న శ్రీ వల్లి దేవసేన సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు జరిగాయి. ఉదయం స్వామివారికి నిత్య అభిషేకాలు నిర్వహించి, ధూప దీప నైవేద్యాలతో హారతులు ఇచ్చి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా నిర్వహిస్తున్న సోమవారోత్సవాల్లో భాగంగా ఆరవ వారం కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పరిసరాల్లో ఉన్న శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి, శనీశ్వర స్వామి, వినాయక స్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో కూడా భక్తుల సందడి నెలకొంది. సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రాకారోత్సవం,

నాగులమ్మ పుట్ట వద్ద కళ్ళు, చెవి, ముక్కు, గొంతు తదితర ఆరోగ్య సమస్యలకు పుట్టలో పడిగెలు, పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వహకులు భక్తులకు అన్నదాన వసతి ఏర్పాటు చేశారు. కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా భద్రత ఏర్పాటు చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రజల అప్రమత్తంగా ఉండాలి అని తహశీల్దార్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ తుపాన్ సమయంలో ప్రజలు బయటకు రాకూడదని వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయరాదన్నారు. గ్రామస్థాయి అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ అధికారులు పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ ఉండాలని విపత్తులు జరిగినప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందించాలి అన్నారు.

మదర్ థెరిసా విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-గంగవరం:

ఈ నెల 12వ తేదీన విడుదలైన ఎస్వీ యూనివర్సిటీ నాలుగవ సెమిస్టర్ ఫలితాలలో మదర్ థెరిసా కళాశాల విద్యార్థులు చదువుతున్న మహీం 9.33, పునీత్ 9.10, సంతోష్ 9.9, బీఎస్సీ చదువుతున్న గౌతమి 9.36, రోహిణి 9.8, బిసిఎ చదువుతున్న తనుజ 9.7, అర్చన 82, బికాం చదువుతున్న రక్షిత 8.84, కుసుమ 8.76, చైతన్య 8.74 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు. బిఎస్సి, బీకాం, బీసీఏ, బిబిఏ రెండవ సంవత్సరం నాలుగో సెమిస్టర్ 250 డిస్టింక్షన్ వంద మంది విద్యార్థులు ప్రథమ శ్రేణులు పాసై కళాశాల టాపర్‌లుగా నిలిచినట్లు కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు తోడ్పడిన విద్యార్థులను, ఉపాధ్యాయులను, ప్రిన్సిపాల్ మధుసూదన్ రావు, చైర్మన్ సునీల్ బాబు, అకడమిక్ అధికారి రాజేందర్ రెడ్డి అభినందించారు.

S MAHEEN BBA 9.33
P PINITH KUMAR BBA 9.10
K SANTHOSH BBA 9.09
KJ GOWTHAMI BSC9.36
K ROHINI B.SC 9.05
A THANUJA BCA 9.07
T ARCHANA BCA 8.82
KR RAKSHITHA BCOM 8.84
G KUSUMA B.COM 8.76
K CHAITHANYA B.COM 8.74

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి-విజయపురం(నగిరి): రాష్ట్రంలో తుపాను ప్రభావం ఉన్నందున ప్రతి మండలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. సోమవారం నగిరి మున్సిపల్ కార్యాలయంలో తుపాను ప్రభావతంపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మరో రెండు రోజులు తుపాన్ హెచ్చరికలు ఉన్నందున మండలంలో ఆయా శాఖ అధికారులు ముంపు ప్రదేశాలను గుర్తించి అక్కడ ఉన్న ప్రజలను సురక్షితమైన ప్రాంతాలకు తరలించడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఏ క్షణమైనా తుపాను ప్రభావం అధికంగా ఉండవచ్చునని, చర్యలో భాగంగా ముంపు గ్రామాలను గుర్తించి అక్కడ అధికారులు అప్రమత్తం చేయాలని తెలిపారు. అలాగే సెలవుపై ఉన్న

అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే భాను ప్రకాష్

అధికారులు కూడా వెంటనే వీధిలోకి రావాలని తుపాను ప్రభావం వల్ల ప్రజలకు ఎలాంటి నష్టం కలిగించకుండా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కెవి కృష్ణారెడ్డి, ఎంపీడీవో సతీష్, తహశీల్దార్ రవికుమార్, విద్యుత్ శాఖ డిఇ వెంకటముని, గృహ నిర్మాణ శాఖ డిఇ శంకరప్ప, సీఐ మహేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె ప్రగతికి కృషి

- మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చొరవ
- రూ.12కోట్ల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు
- గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం
- ఎమ్మెల్యే డాక్టర్ థామస్

ప్రజాశక్తి-కార్వేటినగరం: పల్లె ప్రగతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. ఎమ్మెల్యే స్వగ్రామం అల్లాగుంట గ్రామానికి రూ.20లక్షలతో సిమెంట్ రోడ్డు మంజూరైంది. సోమవారం రోడ్డు పనికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మొదటి విడతగా నియోజకవర్గంలో రూ.12కోట్లతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అల్లాగుంట గ్రామంలో రూ.20లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం, కార్వేటినగరం పంచాయతీ పద్మ సరస్సు జగనన్న లేఅవుట్ వద్ద


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

రూ.36లక్షలతో, శెట్టిగుంట యానాది కాలనీలో రూ.18లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజల చేపట్టినట్లు ఆయన స్పష్టం చేశారు. పల్లె పండగ వారోత్సవాలు 14 నుంచి 20తేదీ వరకు జరుగుతుందన్నారు. మండలంలో 32 పనులకు గాను దాదాపుగా మూడు కోట్ల రూపాయలు మంజూరు అయిందన్నారు. వీటిని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ రోడ్లకు మహర్దశ రావడం ఓ వరమని ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చెంగల్ రాయల్ యాదవ్, జీడి నెల్లూరు జనసేన ఇన్‌ఛార్జ్ పొన్న యుగంధర్, పిఆర్‌డిఈ ఆనంద్ రెడ్డి, తహశీల్దార్ భగవతి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ గిరీష్, ఈవో నాగరత్నమ్మ, ఏఈ దినేష్, మనోజ్ కుమార్, నాయకులు సోమశేఖర్ యాదవ్, సోము, రాజా, వినోద్ కుమార్, రాంబాబు రెడ్డి, దాము తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-శాంతిపురం:

వాతావరణ శాఖ వారి తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఈ క్రింద తెలిపిన జాగ్రత్తలు, సత్వర చర్యల గురుంచి రైతాంగానికి శాంతిపురం మండల వ్యవసాయ అధికారి అప్పోజి పాటించాలని తెలిపారు. తుపాను నుంచి పొలాల్లో రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను సోమవారం ఆయన సూచించారు. ముఖ్యంగా వరి పంట : పంట గింజ గట్టిబడి కోతకు సిద్దంగా వున్న వరిలో సత్వరమే కంబైన్డ్ హార్వెస్టర్ ఉపయోగించి, వచ్చిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతంలో వర్షానికి తడవకుండా ఆర బెట్టుకోవడం, తగినన్ని టార్పలిన్, పాలిథిన్ పట్టాలను పూర్తి స్థాయిలో అందుబాటులో పెట్టుకోవడం, తుఫాను వెలిసిన తరువాత ఆ ధాన్యాన్ని ఆరబెట్టుకునే విధంగా వుండటం చేయవలసి వుంటుంది. వరి పంట కోసి చేనులో

అప్పోజి, వ్యవసాయ అధికారి

వుండే పరిస్థితులలో తక్షణమే పనలను కట్టలు కట్టి గూడు/కుప్పలు పోసి పంటను వర్షాల నుంచి తడవకుండా చూడటం, తడిసిన వాటికి మొలకలు రాకుండ 5శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి. ముందస్తుగా దిగువశ్రేణి క్షేత్ర సహాయకులు అవగాహన కల్పించడం చేయ వలసినదిగా తెలుపుట మైనది. అదే విధంగా మెట్ట పంటలు అయినటువంటి ఖరీఫ్ పత్తి, మిరప పంటల చేనులలో వర్షపు నీరు నిలవ కుండా, వర్షపు నీరు వేగంగా, సులభంగా కొట్టుకు పోయే విధంగా చేల గట్లలో ఎక్కువ సంఖ్యలో వాలుకు నిలువుగా గండ్లు చేయాలి. పత్తి పంట 3వ తీతకు కాయలు విచ్చుకుని పత్తి తీతకు సిద్ధమైన కాయల నుంచి పత్తిని తీయడం, మిరపలో తయారైన పచ్చి మిరప, పండు మిరపను చేను నుంచి కోసి, అధిక వర్షాల నుంచి కాయలు తడవకుండా, బూజు పట్టకుండా కాపాడుకోవచ్చు అన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-పుంగనూరు: రెండు వేర్వేరు ప్రాంతాల్లో వాహనాలు ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఒకరిని తిరుపతి రుయాకు తరలించగా ఆమె పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు ఇలా... మండలంలోని గూడూరు పల్లి గ్రామానికి చెందిన గంగాభవాని తల్లి అదెమ్మ (65) మతిస్థిమితం లేక ఇంటి నుంచి ఆదివారం రాత్రి వెళ్లిపోయింది. ఆమెను భీమగానిపల్లి బైపాస్ రోడ్డు సర్కిల్లో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో ఈమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఈమె ఇంటి నుంచి వెళ్లిపోయిన వెంటనే ఆమె కుమార్తె గంగాభవాని పోలీసులకు సమాచారం అందించింది. రాంపల్లి గ్రామంలో నడుచుకొని వెళ్తున్న వృద్ధుడు వెంకటరమణ (70)ను గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధునికి తీవ్ర గాయాలయ్యాయి. పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం మదనపల్లికి తరలించారు.


ఆవేదనలో బాధిత కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-పలమనేరు: పట్టణంలోని పాతపేట జెండా మఠం మసీదు వద్ద నివాసం ఉంటున్న ఆరీఫ్ ఇంట్లో సోమవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో రూ.లక్ష ఆస్తి నష్టం జరిగిందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంట్లోని వాషింగ్ మిషన్, ఫ్యాను, ఫ్రిడ్జ్, దుస్తులు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలను అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి-శాంతిపురం:

కడపల్లి కస్తూరిబా పాఠశాల వద్ద కుప్పం - పలమనేరు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఇద్దరు వ్యక్తులకు గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికుల కథనం మేరకు.. శాంతిపురం మండలం రాళ్ళబూదుగూరు గ్రామానికి చెందిన జమీర్ అహ్మద్, మహమ్మద్ సిద్దిక్, తమిళనాడు రాష్ట్రం చెందిన లోకేష్, తరుణ్ రాళ్ళబూదుగూరు వద్ద నుంచి కుప్పం వైపుగా కారులో వెళుతుండగా కడపల్లి వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న దిమ్మెకు ఢీకొని పక్కనున్న పొలాల్లో పడింది. ఇందులో జమీర్ అహ్మద్ అక్కడే మృతి చెందగా మిగిలిన ముగ్గురిని 108లో కుప్పం పిఎస్ ఆసుపత్రికి తరలించారు. మొహమ్మద్ సిద్దిక్ పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి తిరుపతికి తరలించారు. ఈ మేరకు రాళ్ళబూదుగూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో అగ్ని ప్రమాదం

- లక్ష ఆస్తి నష్టం

పూర్తిగా కాలిపోయిన ఫ్రిడ్జ్

అదుపుతప్పి కారు బోల్తా

- ఒకరు మృతి

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు